
పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

కేటీఆర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోండి

సైదాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఓ చానల్ ఇంటర్వ్యూలో సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా వాడిన పదజాలం అభ్యంతరకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌సదన్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నగరగారి దాసు, యూత్ కాంగ్రెస్ నగర కార్యదర్శి లడ్డూపటేల్, రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ నాగిళ్ల రాములు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాను తనిఖీ చేసిన రవీంద్రనాయక్


బస్తీ దవాఖానాలో రికార్డులను పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్

హయత్‌నగర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బస్తీ దవాఖానాకు వచ్చే రోగులకు సరియైన వైద్య సేవలు అందించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ ఎన్ఎస్ఆర్‌నగర్ కాలనీలో బస్తీ దవాఖానాను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను, హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్లు సమయపాలన పాటించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి హెప్సిబా, ఇబ్రహీంపట్నం సబ్ యూనిట్ ఆఫీసర్ హేమాలాల్ తదితరులు పాల్గొన్నారు.

గీతా జయంతిపై విద్యార్థులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఆధ్యాత్మిక గురువు రవికృష్ణశర్మ

చాదర్‌ఘాట్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లోని వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో గీతా జయంతి సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల చైర్మన్ పమ్మి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సుకు ఆధ్యాత్మిక గురువు డాక్టర్ భమిడిపాటి రవికృష్ణశర్మ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. విద్యార్థిలందరిలోను సమానమైన శక్తి ఉందని, దానిని ఉద్దీపన చేస్తే ఎటువంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని రవికృష్ణశర్మ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కేసీరాజు కామేశ్వర్‌రావు, కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్, వెంకటేశ్ పాల్గొన్నారు.


నూతన ప్రతినిధులకు నియామక పత్రాలు అందజేస్తున్న సదానందం, దశరథ

గుర్రంగూడ కురుమ సంఘం కార్యవర్గం ఎన్నిక

సరూర్‌నగర్ : బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో బుధవారం కాటి కుమార్‌కురుమ ఆధ్వర్యంలో కురుమ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సదానందం, జిల్లా అధ్యక్షుడు సిద్దాల దశరథ హాజరై సంఘం గుర్రంగూడ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలోని ప్రతినిధులకు నియామక పత్రాలు అందజేశారు. అధ్యక్షుడిగా ఆర్ల శ్రీనివాస్‌కురుమ, ఉపాధ్యక్షులుగా ఇమ్మిడి బాబుకురుమ, దడిగ నర్సింహకురుమ, ప్రధాన కార్యదర్శిగా కాటి కుమార్‌కురుమ, సహాయ కార్యదర్శులుగా గొరిగె సత్యనారాయణకురుమ, రావుల భాస్కర్‌కురుమ, కోశాధికారిగా ఇమ్మిడి మల్లేశ్‌కురుమ, తొమ్మిది మంది సలహాదారులుగా, మరో ఐదుగురు సభ్యులుగా ఎన్నికయ్యారు.

టీపీసీ సేవాదళ్ కార్యదర్శిగా సంగీత

చంపాపేట : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ కార్యదర్శిగా ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన పడాల సంగీత నియమితులయ్యారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని టీపీసీ సేవాదళ్ కార్యాలయంలో బుధవారం టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ చేతుల మీదుగా సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా పడాల సంగీత నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు గాను మిద్దెల జితేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ సేవాదళ్ అధ్యక్షుడు మూసా ఖాసీం, గాంధీభవన్ సేవాదళ్ ఆర్గనైజేషన్ ఇన్‌చార్జి సురేందర్ పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో చిన్నారులకు దుప్పట్ల పంపిణీ

చంపాపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని మాస్టర్‌మైండ్ స్కూల్ విద్యార్థులు అదేకాలనీకి చెందిన అనాథాశ్రమంలోని విద్యార్థులకు బుధవారం పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బ్లాంకెట్స్, ఆటబొమ్మలను అందజేసినట్లు ప్రిన్సిపాల్ కె.విజయరాణి తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సేవాగుణం విద్యార్థులకు చిన్నతనం నుంచే నేర్పించాలని కోరారు. కార్యక్రమంలో మాస్టర్‌మైండ్ దుర్గం జగత్, చైర్మన్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జలాల్‌పూర్ దుర్ఘటన మృతుడు అక్షయ్‌కుమార్ కుటుంబ సభ్యులకు ఎంపీ ఈటల పరామర్శ

కొత్తపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జలాల్‌పూర్ చెరువులోకి దూసుకెళ్లిన కారు దుర్ఘటనలో మృతుడు అక్షయ్‌కుమార్ కుటుంబ సభ్యులను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు. ఈ నెల 7వ తేదీన పోచంపల్లి సమీపంలోని జలాల్‌పూర్ చెరువులోకి కారు దూసుకెళ్లిన దుర్ఘటనలో ఎల్బీనగర్‌కు చెందిన ఐదుగురు యువకులు దుర్మరణం చెందిన సంగతి తెలిసిందే. మృతుల్లో కొత్తపేట డివిజన్ ఆర్టీసీ కాలనీకి చెందిన కలకోటి నర్సింహాచారి, విమల దంపతుల రెండో కుమారుడు అక్షయ్‌కుమార్ అలియాస్ బల్లు(21) ఉన్నాడు. బుధవారం రాత్రి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్‌తో కలిసి మృతుడి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పరంగా సహాయం అందించడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఆర్కేపురం బీజేపీ నాయకులు ధీరజ్‌రెడ్డి పాల్గొన్నారు.

కొడంగల్‌లో పశువైద్య కళాశాల ఏర్పాటు

రాజేంద్రనగర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కొడంగల్ పరిధిలో పశువైద్య కళాశాల భవనాల నిర్మాణానికి పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం అధికారులు రోడ్లు, భవనాలశాఖ అధికారులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. బుధవారం బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలోని పశువైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో ఈ ఒప్పందం జరిగింది. కళాశాల ముఖ్య భవనం, పశువైద్యశాల, బాలికలు, బాలుర వసతి గృహం తదితర భవనాలు నిర్మించనున్నారు. సుమారు 38 ఎకరాల విస్తీర్ణంలో రూ. 171 కోట్ల అంచనా వ్యయంతో వ్యవసాయ కళాశాల భవనాలు నిర్మిస్తామని పశుసంవర్థకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వర్సిటీ ఉపకులపతి సబ్యసాచి ఘోష్ తెలిపారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శరత్‌చంద్ర, ఎస్టేట్ ఆఫీసర్ ప్రొఫెసర్ చిన్ని ప్రీతమ్, రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్‌రెడ్డి, ఎస్ఈ వసంతనాయకులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి

- సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): క్రిమినల్ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశించారు. శంషాబాద్ డీసీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన క్రైం సమీక్ష సమావేశంలో పాల్గొన్న సీపీ ఈ సందర్భంగా అధికారులకు పలు సూచలను జారీ చేశారు. కేసుల తీవ్రతను బట్టి హత్య, హత్యాచారం, పోక్సో, దోపిడీ, స్నాచింగ్, మోసం, పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని సూచించారు. పెరుగుతున్న సైబర్ నేరగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

పరాధీనంలో కమ్యూనిటీ హాళ్లు

- నియంత్రణ లేకుండా పోయిన జీహెచ్ఎంసీ
- ఇష్టారాజ్యంగా అద్దె వసూలు
- దోచుకుంటున్న టెంట్‌హౌస్ కాంట్రాక్టర్లు



కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన నోటీస్



సైదాబాద్‌కాలనీ కమ్యూనిటీ హాల్

సైదాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహానగరంలో ఏ శుభ కార్యం చేయాలన్న ప్రైవేటు ఫంక్షన్ హాళ్లను సంప్రదించాల్సిందే. అందుకు లక్షల్లో అద్దె చెల్లించాలి. కార్యం కంటే ఎక్కువగా అద్దె తలకు మించిన భారంగా మారుతోంది. ఈ భారం పేదలకు పడకుండా జీహెచ్ఎంసీ నిధులతో డివిజన్ల వారీగా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టింది. కానీ కొన్ని కాలనీ సంక్షేమ సంఘాలు తమ సొంత ఆస్తిగా భావిస్తూ వ్యాపారాలు నిర్వహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. జీహెచ్ఎంసీ నిర్ధారించిన అద్దె రుసుంలు కాకుండా ఎవరి సంఘం వారు వారి ఇష్టారాజ్యంగా అద్దె వసూలు చేస్తున్నారు. అధికారులు పట్టించుకునే వారు లేకపోవడంతో కొన్ని కాలనీ సంక్షేమ సంఘాలు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుందన్న విమర్శలు వస్తున్నాయి.

నిర్మించి.. నిర్వహణ గాలికి

సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్ల పరిధిలో పలు కమ్యూనిటీ హాళ్లను జీహెచ్ఎంసీ లక్షలు వెచ్చించి నిర్మించారు. కానీ అధికారుల నిర్వహణ బాధ్యతలను గాలికొదిలేయడంతో కాలనీ సంక్షేమ సంఘాలు స్వాధీనం చేసుకున్నాయి. కాలనీ సంఘాల వారు సమావేశాలు నిర్వహించుకునేందుకు, వారి సాధకబాధకాలు చర్చించుకునేందుకు, నిర్ణీత ధరలకు అవసరమైన శుభ కార్యాలకు అందుబాటులో ఉంచాలి. కానీ కమ్యూనిటీ హాళ్ల పేరుతో సంఘాలు అనధికారికంగా వ్యాపారాలు చేస్తున్నాయి. కానీ, ట్రేడ్ లైసెన్స్, ఆస్తిపన్ను, డొమెస్టిక్ విద్యుత్, నీటి బిల్లులు, జీఎస్టీ చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఆదాయంపై సహకారశాఖ అధికారులు కనీసం ఆడిటింగ్ జరపడం లేదని తెలుస్తోంది.

టెంట్, వంట సామగ్రి పేరిట దందాలు..

కమ్యూనిటీ హాళ్లలో టెంట్ సామాను కాంట్రాక్టర్లతో కొందరు కాలనీ సంక్షేమ సంఘాల నేతలు కుమ్మక్కై దోచుకుంటున్నారు. కమ్యూనిటీ హాల్‌లో ఫంక్షన్ చేసుకునేవారు టెంట్, వంట సామగ్రి, డెకరేషన్ వారు నిర్ణయించిన సదరు కాంట్రాక్టర్ వద్దే ఖచ్చితంగా తీసుకోవాలి. ఇతరుల నుంచి తీసుకునేందుకు అనుమతించడం లేదు. దీంతో సదరు కాంట్రాక్టర్ ఇష్టారీతిన సామగ్రి అద్దె వసూలు చేస్తూ సొమ్ము కాజేస్తున్నారు. ఈ దందాలో కొందరి నేతలకు వాటాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. టెంట్ సామగ్రి పేరుతో కాంట్రాక్టర్ల, నేతల దోపిడీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


వినయ్‌నగర్ కమ్యూనిటీ హాల్

అధిక అద్దె వసూలు చేస్తే చర్యలు



కమ్యూనిటీ హాళ్లను జీహెచ్ఎంసీ నిర్ణయించిన ధరలకే ఇవ్వాలి. ఎవరి వద్దనైనా అధిక అద్దె వసూలు చేసినట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. కమ్యూనిటీ హాళ్లను పేద, మధ్య తరగతి వారికి అందుబాటులో ఉండాలనే నిర్మిస్తాం. కాలనీ కమ్యూనిటీ హాళ్లను ఆదాయ వనరులుగా మార్చుకుంటే సహించేది లేదు.

- జయంత్, డిప్యూటీ కమిషనర్, మలక్‌పేట సర్కిల్

అధికారులు చర్యలు తీసుకోవాలి



కమ్యూనిటీ హాళ్ల నిర్వహణ బాధ్యతను జీహెచ్ఎంసీ గాలికి వదిలేయడంతో కాలనీ సంఘాలు వాటిని స్వాధీనం చేసుకుని కొందరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. జీహెచ్ఎంసీ నిర్ణయించిన అద్దె వసూలు చేయకుండా అధికంగా దండుకుంటున్నారు. టెంట్, వంట సామగ్రిని తమకు అనుకూలంగా కాంట్రాక్టర్లకు ఇచ్చి ప్రజలను దోచుకుంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- రమణ్‌సింగ్, సైదాబాద్

అట్టహాసంగా సీఎం కప్ క్రీడా పోటీలు

సరూర్‌నగర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం బడంగ్‌పేట్‌లోని మునిసిపల్ ప్లే గ్రౌండ్‌లో విద్యార్థులకు సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించారు. బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ఈ పోటీలను ప్రారంభించి, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులను(విద్యార్థులను) పరిచయం చేసుకున్నారు. పోటీల్లో భాగంగా ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా పారిజాతారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ పి.సరస్వతి, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, నాయకులు ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, బొర్ర జగన్‌రెడ్డి, సుభాన్‌యాదవ్, లక్ష్మారెడ్డి, జక్కిడి విష్ణువర్ధన్‌రెడ్డి, మనోహర్, శ్రీధర్, రమేశ్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, బహుగుణనాయక్ పాల్గొన్నారు.


విద్యార్థినులను పరిచయం చేసుకుంటున్న మేయర్ పారిజాతారెడ్డి, డిప్యూటీ మేయర్ శేఖర్, కమిషనర్

రోడ్డు పనులు ప్రారంభం

బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ 19వ డివిజన్‌లోని మల్లికార్జునకాలనీలో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను బుధవారం కార్పొరేటర్ రామోజీ అమితాశ్రీశైలంచారితో కలిసి మేయర్ పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. మునిసిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కాలనీప్రతినిధులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కోదండరాం, జడ్జి శ్రీదేవి

పిల్లలతో స్నేహం చేద్దాం రండి పుస్తకావిష్కరణ

ఎల్బీనగర్ : ఆర్కేపురం వాసవీకాలనీలోని వాసవీ ఆధ్యాత్మిక కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల మిత్రులైన కె. శాంతారావు రచించిన పిల్లలతో స్నేహం చేద్దాం రండి పుస్తకాన్ని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చల్లా కోదండరాం బుధవారం ఆవిష్కరించారు. ఎస్వీవీకే శ్యామలదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, అష్టలక్ష్మి ఆలయం, వాసవీ ఆస్పత్రుల ఫౌండర్ చైర్‌పర్సన్ చంద్రశేఖర్‌గుప్తా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వాసవీ, వనిత క్లబ్‌ల కార్యవర్గం ఎన్నిక

మన్సూరాబాద్ : 2025 ఏడాదికి గాను వనస్థలిపురం వాసవీక్లబ్, వాసవీక్లబ్ వనితల నూతన కార్యవర్గాన్ని స్థానికంగా ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఎన్నుకున్నారు. వనస్థలిపురం వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా అల్వాల మురళీధర్‌గుప్తా, కార్యదర్శిగా బల్దె రాములు, కోశాధికారిగా పొలిశెట్టి కృష్ణమూర్తి, అదేవిధంగా వాసవీక్లబ్ వనిత వనస్థలిపురం అధ్యక్షురాలిగా అల్వాల ఉషారాణి, కార్యదర్శిగా చిగురంబొట్ల స్వప్న, కోశాధికారిగా పొలిశెట్టి ఉమాదేవి ఎన్నికయ్యారు. వాసవీయన్ జిల్లా ప్రతినిధులు విట్టదురయ్య, శివనాగేశ్వరరావు, మర్యాల చంద్రమౌళిగుప్తా, నర్సింహుల పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశంలో వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షుడు స్వామి అచ్యుతరావు 2024లో నిర్వహించిన కార్యక్రమాలను గురించి వివరించారు. నూతన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా జిల్లాస్థాయి గణిత ప్రతిభా పోటీలు



గెలుపొందిన విద్యార్థులతో అధికారులు, అధ్యాపకులు

హయత్‌నగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మ్యాథ్స్ ఫోరం రంగారెడ్డి జిల్లాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గణిత ప్రతిభాపాటవ పోటీ పరీక్షలను బుధవారం హయత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని 27 మండలాల నుంచి ప్రతి మీడియం నుంచి ముగ్గురేసి విద్యార్థుల చొప్పున పాల్గొన్నారు. అదేవిధంగా కేజీబీవీ రెసిడెన్సియల్ మోడల్ స్కూల్ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ప్రతిభ కనబరిచిన తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఇంగ్లీష్ మీడియం నుంచి కార్తీక్, నీరజ్, శివచరణ్, తెలుగు మీడియం నుంచి పవన్‌కుమార్, సంజన, ఏఎస్ మోహిత్, మోడల్ స్కూల్ నుంచి సంకీర్తన, సింధు, పల్లవీలు ఎంపికైనారు. నక్క శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో టీఎంఎఫ్ రంగారెడ్డి అధ్యక్షుడు యాదగిరిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాశమల్ల శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, డీసీవి సెక్రెటరీ అరుణ్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- పాలకవర్గం సమావేశంలో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి


హమాలీలకు గుర్తింపు కార్డులను అందజేస్తున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం బాటసింగారంలోని ఫ్రూట్ మార్కెట్‌లో పాలకవర్గం 2వ సమావేశాన్ని చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. మార్కెట్ అభివృద్ధిపై చర్చించి పలు తీర్మానాలను పాలకవర్గం ఆమోదించింది. అనంతరం హమాలీలకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మార్కెట్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారికి న్యాయం చేయడమే పాలకవర్గం లక్ష్యం అన్నారు. త్వరలోనే కొహెడలో రూ.2వేల కోట్లతో నూతన సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టబోతున్నట్లు స్పష్టం చేశారు. మార్కెట్ పరిధిలోకి వచ్చే రైతుబజార్లు, ఎన్టీఆర్‌నగర్ మార్కెట్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ రైతుల సలహాలు, సూచనలు తీసుకుంటూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, డైరెక్టర్లు మహేందర్‌రెడ్డి, అంజయ్య, లక్ష్మి, రఘుపతిరెడ్డి, గణేష్‌నాయక్, నర్సింహ, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌గుప్తా, ఇబ్రహీం, మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, మార్కెట్ అధికారులు హర్షవర్ధన్, రాజ్‌కుమార్, విజయ్, మురళి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు.. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్

కొత్తపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడమే ప్రధానమని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ అన్నారు. బుధవారం జిల్లెలగూడలో గల లార్డ్స్ టాలెంట్ స్కూల్ నుంచి 40 మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ బడంగ్‌పేట, విజయపురికాలనీ, కొత్తపేట, ఎల్బీనగర్‌లలోని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు, రామాంతపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు టీటీఐ సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు.

14 కార్యక్రమాల్లో 621 మంది విద్యార్థులకు అవగాహన

14 కార్యక్రమాల్లో 621 మంది విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను పరిచయం చేశారన్నారు. విద్యార్థులు నిబంధనలను పాటించాలని ఇతరులకు అవగాహన కల్పించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడపరాదని జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులకు పార్కు ఆవరణలో గల సైనేజీ బోర్డులను చూపుతూ, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతను గుర్తుచేశారు. టీటీఐ లెక్చర్ హాల్‌లో 5డీడీ కౌన్సెలింగ్ సెషన్స్‌లో 110 మంది పాల్గొన్నారు. కార్యక్రమాల్లో టీటీఐ విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, ఏఎస్ఐ సోమ్‌నాథ్, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్, సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.


ట్రాఫిక్ నిబంధనలు తెలియజేస్తున్న అధికారి


ట్రాఫిక్ నిబంధనలను పరిచయం చేస్తున్న ఇన్‌స్పెక్టర్ అర్జున్

సరూర్‌నగర్ : విద్యార్థులు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడలోని లార్డ్స్ విద్యా సంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప పేర్కొన్నారు. బుధవారం స్కూల్ పిల్లలను ఎల్బీనగర్‌లోని ట్రాఫిక్ స్టేషన్‌కు తీసుకెళ్లి, అక్కడి ట్రాఫిక్ పార్కులో చిన్నారులకు ట్రాఫిక్ పాఠాలు నేర్పించారు. వారికి బ్యాటరీ బైకులు, సైకిళ్లు ఇచ్చి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీలత, ప్రిన్సిపాల్ మరియన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య బిజినెస్ సమ్మిట్‌లో ప్రసంగిస్తున్న ప్రముఖులు

ఘనంగా ఆర్యవైశ్యుల బిజినెస్ సమ్మిట్

మన్సూరాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ పరిధిలోని కిన్నర గ్రాండ్ హోటల్‌లో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వి-102ఏ గవర్నర్ సూరిశెట్టి నర్సింహగుప్తా, ప్రాజెక్ట్ చైర్మన్ బాదం కృష్ణారావుల ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల బిజినెస్ సమ్మిట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఇమ్మడి జ్యువెల్లరీ వ్యవస్థాపకుడు ఇమ్మడి రమేష్, ప్రాజెక్ట్ ఇంటర్నేషనల్ సీనియర్ ఉపాధ్యక్షుడు విశ్వనాథం నాగేశం, శ్రవణ్‌కుమార్, సినీరంగ లేడీ ప్రొడక్షన్ డైరెక్టర్ దీప్తి మట్ట విచ్చేసి వ్యాపారంలో ఉండాల్సిన లక్షణాలు, మెలకువలను వివరించారు. కార్యక్రమంలో రాజేష్ దర్మకేశ్వర్, బాదం కళావతి, ఎలుకుర్తి శ్రీనివాస్, ఆలేటి రవికుమార్, చంద్రమౌళి, విజయకుమార్, విజయలక్ష్మి, డాక్టర్ అనంతం పాల్గొన్నారు.


బ్రాహ్మణ వివాహ పరిచయవేదిక కరపత్రాన్ని విడుదల చేస్తున్న జగన్మోహన్‌శర్మ, శ్రీనివాస్ తదితరులు

జనవరి 26న బ్రాహ్మణ వివాహ పరిచయవేదిక

ఎల్బీనగర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో జనవరి 26న రాష్ట్రస్థాయి బ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయవేదిక నిర్వహిస్తున్నట్లు సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆర్కేపురంలో జరిగిన కార్యక్రమంలో ఉచిత వివాహ పరిచయవేదిక కరపత్రాన్ని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్‌శర్మ ఆవిష్కరించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్తపేటలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో జరుగనున్న ఈ ఉచిత వివాహ పరిచయవేదికలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలలోని బ్రాహ్మణులంతా పాల్గొంటారన్నారు. పరిచయవేదికలో పాల్గొనాలని ఆసక్తి గల వారు జనవరి 5లోగా తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు ఫోన్ నంబర్ 8008080757 లో సంప్రదించాలని ఆయన సూచించారు. సమాఖ్య ప్రతినిధులు భాస్కరమూర్తి, రఘునందన్, నాగరాజు, కల్పవల్లి, విఠల్‌శర్మ పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

మన్సూరాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వెల్నెస్ సెంటర్లలోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ శాంతికుమార్ కోరారు. ఈ మేరకు ఆరోగ్యశ్రీ ఈహెచ్ఎస్ ట్రస్ట్ నూతన సీఈఓ శివశంకర్ లోతేటిని బుధవారం వనస్థలిపురం వెల్నెస్ సెంటర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆయన సాధ్యాసాధ్యాలను పరిశీలించి వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ట్రస్ట్ నూతన సీఈఓగా ఎన్నికైన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ ఉపాధ్యక్షులు డాక్టర్ లావణ్యకుమారి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ రఫీ ఉద్దీన్, జనరల్ సెక్రెటరీ బోన్కటి సుభాష్, సభ్యులు డాక్టర్ రాము, డాక్టర్ శరత్, ఫార్మాసిస్ట్ రాధాకృష్ణ, అడ్మిన్ మహేష్, మైక్రోబయాలజిస్ట్ సందీప్ పాల్గొన్నారు.

అల్మాస్‌గూడ కార్పొరేటర్‌కు మాతృ వియోగం

సరూర్‌నగర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ 24వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి మాతృమూర్తి ఏనుగు పద్మమ్మ(75) బుధవారం అనారోగ్యంతో మరణించారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, పలువురు కార్పొరేటర్లు, నాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్పొరేటర్ రాంరెడ్డిని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అల్మాస్‌గూడ శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.

కదిలే రైలు నుంచి పడిన యువకుడి మృతి

అడ్డగుట్ట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కదిలే రైలులో నుంచి పడి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. కానిస్టేబుల్ శ్రీనివాస్, రైల్వేపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా జగన్నాథపురంకు చెందిన లింగమూర్తి (26) ఈనెల 10న విశాఖపట్నం నుంచి ముంబయికు వెళ్లే ట్రైన్‌లో ప్రయాణిస్తున్నాడు. 12:40 సమయంలో రైలు మౌలాలీ స్టేషన్ రెండో ప్లాట్‌ఫామ్‌కు వచ్చింది. డోర్ వద్ద నిల్చున్న లింగమూర్తి ట్రైన్ కుదుపునకు ప్లాట్‌ఫామ్, పట్టాలమధ్య పడిపోయాడు. తీవ్రగాయాలైన లింగమూర్తిని 108లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే లింగమూర్తి మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.